# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ గడువును ఈరోజు సాయంత్రం వరకు రాష్ట్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

**2.** సింహాచలంలో శ్రీవరాహలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రేపు చందనోత్సవాన్ని నిర్వహిస్తామని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున తెలిపారు.

**3.** ఆంధ్రప్రదేశ్, ఒడిశా ఎన్నికల నేపథ్యంలో రెండు రోజులపాటు రెండు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

**4.** ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్ష తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది.

**5.** ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు గోపాలకృష్ణ గోఖలే జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.

==========================

ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌కి గడువును పెంచుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. నిన్నటితో పోలింగ్ గడువు ముగియగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ గడువుని ఈరోజుకి పొడగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ రోజు సాయంత్రం వరకు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపింది.

--------------------------

రాష్ట్రంలో 59 నెలల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నూలులో నిర్వహించిన ఎన్నికల ప్రచార భేరీలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వైసిపి పాలనలో మహిళలకు, రైతులకు సంక్షేమం కోసం పథకాలను అమలు చేశామని అన్నారు. సభ అనంతరం మధ్యాహ్నం అనంతపురం పార్లమెంట్ పరిధిలోని కళ్యాణ దుర్గం నియోజకవర్గం కొల్లపురమ్మ ఆలయం రోడ్డులో జరిగే సభలో పాల్గొంటారు. తర్వాత రాజంపేట పార్లమెంట్ పరిధిలో రాజంపేట నియోజకవర్గంలో కోడూరు రోడ్డులో జరిగే ప్రచార సభలో జగన్ మోహన్ రెడ్డి పాల్గొంటారు.

--------------------------

విశాఖపట్నంలోని ప్రసిద్ద పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామి వారికి రేపు జరిగే

చందనోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తో కలిసి ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది చందనోత్సవం సందర్భంగా అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశామన్నారు. నీలాద్రి మండప ద్వారం నుంచే భక్తులకు దర్శనం ఉంటుందని, ఎలాంటి ప్రోటోకాల్ దర్శనాలు ఉండవని స్పష్టం చేశారు. నగరపోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ చందనోత్సవానికి సంబంధించి 2 వేల మంది పోలీసులు విధుల్లో వుంటారని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, ఒడిశా ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి ఒడిశాలోని ఖుర్దారోడ్ స్టేషన్‌కు రెండు రోజులపాటు రెండు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ నెల 10, 11 తేదీల్లో సాయంత్రం రెండు రైళ్లు సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతాయని నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపుర్ స్టేషన్లలో ఆగుతాయని ప్రకటనలో తెలిపింది. 11, 12 తేదీల్లో ఖుర్దారోడ్ స్టేషన్ నుంచి రెండు రైళ్లు రాత్రి 10 గంటలకు తిరుగు ప్రయాణమై సికింద్రాబాద్‌కు చేరుకుంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

---------------------------

ఈ నెల 13 వ తేదీన లోక్ సభ, శాసన సభలకు పోలింగ్ జరుగుతున్న దృష్ట్యా మే 11వ తేదీ సాయంత్రం 7 గంటల నుండి 13వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు మద్యం విక్రయాలపై నిషేధం విధించామని పార్వతీపురం మన్యం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.

---------------------------

ప్రకాశం జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించడానికి ఎన్నికల సంఘం కేటాయించిన 8 మంది శిక్షణ ఐపీఎస్ అధికారులకు జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకులు హసీబ్ ఉర్ రెహ్మాన్ ఎన్నికల అంశాలపై అవగాహన కల్పించారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిన్న ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో, ఎన్నికల పరిశీలకులు హసీబ్ ఉర్ రహ్మాన్ ఎన్నికల సమయంలో శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, భద్రతా విధానాల గురించి శిక్షణ ఐపీఎస్ అధికారులకు వివరించారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాల మోహరింపు, ఓటర్లలను ప్రలోభాలకు గురిచేసే అక్రమ మద్యం, డబ్బు, ఇతర వస్తువులు కట్టడి, వాహనాల తనిఖీ వంటి భద్రతా సంబంధిత అంశాల గురించి వివరించారు.

---------------------------

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్ష తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ –యూపీఎస్సీ నిన్న విడుదల చేసింది. గతేడాది నవంబరు 26 నుంచి డిసెంబరు 3 వరకు మెయిన్ పరీక్ష నిర్వహించగా, ఈ సంవత్సరం ఏప్రిల్ 22 నుంచి మే 1 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి తుది ఫలితాలను అధికారులు వెల్లడించారు. మొత్తం 147 మంది ఎంపికవ్వగా, రిత్విక పాండే, కాలె ప్రతీక్ష నానా సాహెబ్, స్వస్తిక్ యదువంశీ తొలి మూడు ర్యాంకులు సాధించారని తెలిపారు. కాగా ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఫలితాల్లో రాష్ట్రంలోని విజయనగరం జిల్లా గంట్యాడ మండలం పెదవేమలికి చెందిన పి.భార్గవ్ 22వ ర్యాంకు సాధించారు.

---------------------------

పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సమస్యాత్మక ప్రదేశాలలో 800 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మే 13వ తేదీన ఎన్నికల సందర్భంగా పోలింగ్ కోసం ఎన్నికల సంఘం అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లాలోని పెదకూరపాడు, గురజాల, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాలలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించామని తెలిపారు.ఏ చిన్న సంఘటన జరిగినా భద్రతా దళాలను, రాపిడ్ రెస్పాన్స్ టీంలను సత్వరం అక్కడికి తరలించి ఆ సమస్యను పరిష్కరించే విధంగా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు.

---------------------------

ఈనెల 11వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకే ఎన్నికల ప్రచారానికి అనుమతి ఉంటుందని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. నిన్న నెల్లూరు నగరపాలకసంస్థ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు 48 గంటల ముందు నిబంధనలను రాజకీయ పార్టీల అభ్యర్థులు పాటించాలన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఒక బూత్‌ను రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, సామాజికవేత్త, భారత జాతీయ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాలకృష్ణ గోఖలే జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. 1866 మే 9వ తేదీన మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా కోట్లక్‌లో జన్మించిన గోపాలకృష్ణ గోఖలే... 1889లో భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించారు. అతి తక్కువ కాలంలోనే 1905లో మితవాదుల ప్రాబల్యం వహించిన భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రముఖ పాత్ర వహించారు. 1905లో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని ఏర్పాటు చేశారు. భారత జాతిపిత మహాత్మాగాంధీ గోఖలేను తన రాజకీయ గురువుగా భావించేవారు. 1902 నుండి 1915 వరకు భారత శాసనమండలి సభ్యునిగా కొనసాగిన గోఖలే... 1915 ఫిబ్రవరి 19వ తేదీన బొంబాయిలో కన్నుమూశారు.

---------------------------

గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల ఉన్నత విద్యను అభ్యసించడానికి 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు కర్నూలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జె.రంగలక్ష్మీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పథకం ద్వారా స్కాలర్‌షిప్ పొందేందుకు మాస్టర్ లెవెల్ పీహెచ్‌డీ, పోస్టు డాక్టరల్ రీసర్చ్ ప్రోగ్రాంలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ నెల 31వ తేదిలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

---------------------------

ద్రోణి, ఆవర్తనం ప్రభావంతో తమిళ నాడు మీదుగా సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని దీని ప్రభావంతో ఈ రోజు రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, ప్రకాశం, జిల్లాల్లో ఈరోజు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. శ్రీకాకుళం, విజయ నగరం, కాకినాడ, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వానలు పడతాయని సూచించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 5, శ్రీకాకుళం 4, విజయనగరంలో 3 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది.

=====================